# జిహ్వ లేచొచ్చింది

**బస్సు** కదిలిపోతుంటే పరుగెట్టి మరీ పట్టుకున్నా—లోపల జనం బాగానే వున్నారు. ముగ్గురు కూర్చోవాల్సిన సీటులో ఇద్దరు ఆడవాళ్ళు కూర్చుని వుండటం చూశాను.

అటు నడిచాను. వారిద్దరి మధ్యా ఒక ప్లాస్టిక్ బుట్ట, దాన్నిండా నిమ్మకాయలున్నాయి. ఒకామెకి సుమారు నలభై అయిదేళ్ళుంటాయి. పక్కన పద్దెనిమిదేళ్ళ కన్నెపిల్ల. నే నా సీటువైపు రెండు అడుగులు వేశాను. ఆ అమ్మాయి నావైపు చూసింది. ఆ కళ్ళల్లో తళుక్కుమని ఆశ్చర్యం కనిపించింది.

"కూర్చోండి" అంటూ వాళ్ళ మధ్యనున్న పళ్ళబుట్టతీసి కింద పెట్టి తను జరిగింది. నేను కూర్చున్నాను. ఇప్పుడా పిల్ల మరీ పరీక్షగా ముఖంలోకి చూసి—

"మీరు....కదూ" అంది.

అవునని నవ్వి వూరుకున్నాను. ఇంక ఆ అమ్మాయి పడిన ఆనందం, గాభరా, హడావిడీ అంతా యింతా కాదు.

"పిన్నీ—ఈమెగారు రచయిత్రి తెలుసా" అంది, ఆనందంతో.

నేను కుంచించుకుపోయాను. చుట్టుప్రక్కల ఒకరిద్దరు నావైపు చూడటం గమనించాను. ఆ క్షణంలో నా కెందుకో జైలులోంచి తప్పించుకు పారిపోతూ పట్టుపడినట్లు అనుభూతి కలిగింది.

ఆ పిన్నిగారు మాత్రం పెదల్పుగా ముఖమంతా నవ్వు పులుముకొని పెద కొంచెం వంచి నవ్వుతూ, కిందపెట్టిన నిమ్మకాయల బుట్ట చేత్తో సర్దింది. నేను కాస్త స్వేచ్ఛగా కూర్చున్నాను.

ఆ అమ్మాయి మెలికలు తిరిగిపోతోంది. ఆమె మాట్లాడే విధానం చూస్తే ఎవరికైనా ఫకాలున నవ్వు వచ్చేస్తుంది. ఒక్కమాట నోట్లోంచి రావాలంటే కనుబొమ్మలు మూడుసార్లు పైకెగిరి పడుతున్నాయి. పెదాలు నక్కిగిళ్ళ పాములా నాలుగు వంకర్లు తిరుగుతున్నాయి.

" మొన్న ఏదో పత్రికలో మీ ఫోటో చూశానండి " అంది గుర్తుచేసుకోటానికి విశ్వప్రయత్నం చేస్తూ—ఆమె బాధ చూడలేక, నేనే చెప్పాను.

" ఆ....మీకు కథల పోటీలో మొదటి బహుమతి వచ్చింది కదూ " అంది.

" మూడో బహుమతి " అని సరిదిద్దాను.

" అందులో కామాక్షమ్మ కోడల్ని విపరీతంగా కష్టాలు పెడితే...."—

" ఆ కథ కాదు "

" అదేననుకుంటానండీ. నేను బాగా చదివాను " అంది. ఈసారి నాకు నవ్వుతోబాటుగా చిన్నగా కోపం కూడా వచ్చింది. అయినా అజ్ఞానాన్ని పట్టించుకోవడం తెలివితక్కువ తనమవుతుందని—

" అది రెండో ప్రైజు కథమ్మా " అన్నాను.

" ఓహో—, ఏది ఏమైనా మీ పేరు ఎక్కడ కనిపించినా చదివేస్తాను " అంది.

ఆ పక్క కూర్చున్న పిన్నిగార్ని చూశాను. ఆమెకీ ఏదో మాట్లాడాలని మహా ఉబలాటంగా వుంది. కానీ ఏం మాట్లాడాలో తెలీకుండా వుంది.

"భారతి కేమైనా రాస్తున్నారా" అంది ఆ అమ్మాయి ఆరిందలాగా. నాకు నిజంగా భయం వేసింది. ఇంతలో పిన్నిగారిలో ఉత్సాహం పుంజుకుంది.

"మీరు భారతిలో రాస్తేనూ, నే చదువుతా. అందులో నిమ్మతొనలని భలే బాగుంటాయి" అంది. నాకు ఈ మాటలెంతో ఇరకాటంగా అనిపించాయి.

" అది భారలి కాదండి జగతి " అన్నాను.

" అలాగా ! ఏమోనమ్మా, పైన పేరు నే నెక్కువగా చూడను. మధ్యాహ్నం అంతా వెళ్ళిపోయాక కాస్త విశ్రాంతిగా నడుంవాల్చి, అప్పుడేదో పుస్తకం తిరగేస్తాను. రెండు లైనులు చదవగానే నిద్ర ముంచుకొచ్చేస్తుంది. పని చేసి చేసి వుంటాం కదా ! "

వెంటనే ఈ సంభాషణ పత్రికలమీంచి, రచనలుమీంచి మళ్ళించక పోతే ఒక్కక్షణం కూడా అక్కడ కూర్చోలేననిపించింది. నా బుర్ర అర నిముషం తీవ్రంగా ఆలోచించింది.

" ఊరగాయ కోసమా నిమ్మకాయలు పిన్నిగారూ " అన్నాను. ఆమె ముఖంలో వెలుగు స్పష్టంగా కనిపించింది.

"అవునండీ ! మా వూర్నించి వస్తున్నాం. మంచి కాయలు, రసం ఎంత బాగుందో చూడండి. ఇలాంటి కాయలే పచ్చడి పెట్టాలి" అంది.

" అయితే పట్టుకెళ్ళడం కొంచెం కష్టం " అన్నాను.

" మా శైలూ కూడా అలాగే అంది. అయినా మన పేపైనా బరువుమోయ్యాలా ఏమన్నానా ? బంగారంలాంటి కాయలు ఇవి దొరికి నప్పుడే పెట్టాలి " అంది మళ్ళీ.

" ఎలా పెడతారు ముక్కలు ఎండ పెడతారా ? " అన్నాను. ఆమె దాదాపు నావైపు తిరిగిపోయింది.

" ఎండపెట్టకపోయినా ఫర్వాలేదు. ఏటి కేడాది వుండాల్సిన పచ్చడి కదా ! ఒక్కసారి ఎండబెట్టి కలుపుతాను. మా ఇంట్లో పచ్చళ్ళు ఎప్పుడూ చిత్తచిత్తలాడుతూ వుండాలి. లేకపోతే ఏమిటీ నిమ్మ ధూళీ, మాగ ధూళీ, ఆవ ధూళీ అంటూ ఎగతాళిచేసి పారేస్తారు." " ఇది నూనె పోసే ఊరగాయ కాదు కదా అందుకని మరీ ఎండపెడితే బాగోదు. అయినా ఇక్కడ ఎండ లెక్కువ. పచ్చళ్ళేం పాడవవు. చివరకంటా ఊట వుంటుంది " అన్నాను.

" నేనేం చేస్తానో తెలుసా, సగానికి సగం రసంతీసి పోస్తాను. "

" అంటే "

" ఏభై కాయలు ముక్కలుచేసి, ఏభై కాయల రసంతీసి పోస్తాను. "

" పోపు అదీ పెడతారా "

" అబ్బే ! బాగుండదండి. ముఖ్యంగా పత్యానికి పనికిరాదు. నేను నిమ్మకాయ ఊరగాయ పెట్టానంటే మూడేళ్ళవరకు చిత్తచిత్తలాడుతూ వుంటుంది. మావాళ్ళ ఇళ్ళల్లో ఎవరింట్లో పురుడు పుణ్యాలైనా మాణిక్యా న్నడిగి చింతకాయ, నిమ్మకాయ పట్టుకు రండర్రా అని పంపిస్తారు. "

" అంత రసం పోస్తే పుల్లగా వుండదూ ? "

" అబ్బే ! దానికి తగ్గట్టు ఉప్పూ, కారం పడతాయి, జిహ్వా లేచొస్తుంది. ముత్యమంతేసుకుని నెయ్యేసుకుని తింటే—"

నాకు నోరూరింది.

"ఆసలెప్పుడూ ఇంట్లో ఉండాలమ్మా....జ్వరాలొచ్చినా, పైత్యంగా వున్నా—"

" నిజమేనండీ పిన్నిగారూ ! మా ఇంట్లో ఏమీ లేవు. నాకేమో చేతకాదు. టైము కూడా వుండదు ! " అన్నాను. ఎలాగైనా ఆమె సానుభూతి పొందాలని—

ఆమె నా చేతులు రెండూ పట్టుకుని " మీ కెక్కడ కుదురు తుందమ్మా ! పైగా రాతలు, కోతలు అని పెట్టుకుంటే ఆడవాళ్ళకి ఇంట్లో పనులేం తెములుతాయి చెప్పండి ! " అంది.

" నిజమేనండీ ! " అన్నాను.

" మీకు కావాలంటే నేను పెట్టి పెడతా, హాయిగా మా వూరు రండి. ఓ పాతిక కాయ పెట్టానంటే ఎక్కా, తక్కా మీకు " అందామె ఆప్యాయంగా.

పడుచుపిల్లకు ఏం మాట్లాడేందుకు తోచలేదు. పాపం ఆమె మా సంభాషణలో బొత్తిగా చోటు చేసుకోలేకపోయింది.

ఆ క్షణంలో నా తెలివితేటలమీద నాకే గర్వం గలిగింది. ఈ సంభాషణ మళ్ళించగలిగినందుకు ఆనందంగా వుంది.

" ఇదిగో అమ్మాయి ! ఫిబ్రవరి, మార్చి నెలలలో అశ్రద్ధ చెయ్యకుండా చింతకాయ, ఉసిరికాయ, నిమ్మకాయ, టమాటో—ఇలా

పచ్చళ్ళు పెట్టుకోకపోతే—, పెద్ద ఊరగాయలు పెట్టేవరకు గడవద్దూ— అందులోనూ మా ఇల్లయితే వచ్చే పోయే కొంప. ఎన్ని పెట్టినా ఒక్కొక్కసారి ఇంట్లో నిప్పచ్చగానే వుంటుంది " ఆమె మాట పూర్తవుతుండగానే బస్సు ఆగింది. నేను దిగాల్సిన గుంటూరు రానే వచ్చింది.

" వస్తానండి పిన్నిగారు " అంటూ దిగాను. మా అభిమానికేసి చూసి వీడ్కోలు చెప్పాను.

" మంచిదమ్మాయి. ఊరగాయలు కావాలంటే అల్లుడిగారితో ఓ మాట చెప్పేసి వరాహపురం వచ్చేయి " అందామె. ఆమె ఏకవచన సంబోధనలో రంగరించిన ఆప్యాయతా, ప్రేమా నా గుండెలో శాశ్వతంగా నిలిచిపోయాయి.